

దమ్మపేట: సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మెచ్చా నాగేశ్వరరావు, నాయకులు



చంద్రుగొండ: రావికంపాడులో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

# ఊరూరా అభివృద్ధి.. ఇంటింటా సంక్షేమం

## బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ



చంద్రుగొండ: మాట్లాడుతున్న ఉప్పల వెంకటరమణ



అశ్వారావుపేట: ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అన్నపురెడ్డిపల్లి: ప్రచారంలో బోయినపల్లి సుధాకర్‌రావు, నాయకులు



దమ్మపేట రూరల్: బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

చంద్రుగొండ, నవంబర్ 6: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఊరూరూ అభివృద్ధి చెందిందని, ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయని బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ చెప్పారు. ఆయన సోమవారం చంద్రుగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం అందించిన బీఆర్ఎస్‌కు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని అన్నారు. కాంగ్రెసోళ్లు తమ 50 ఏండ్ల ఏలుబడిలో తెలంగాణకు చేసిందేమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర ప్రజలు సుఖంగా, మరీ ముఖ్యంగా అన్నదాతలు ఆనందంగా ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితి.. దేశంలోనే మరే రాష్ట్రంలోనూ లేదన్నారు. సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు-నాయకులు రావు జోగేశ్వరావు, దార వెంకటేశ్వరరావు, సంగొండి రాఘవులు, సయ్యద్ రసూల్, భూపతి రమేష్, నరుకుళ్ల సత్యనారాయణ, నల్లమోతు వెంటకనారాయణ, సూర వెంకటేశ్వరరావు, వంకాయలపాటి బాబురావు, గుగులోత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభాస్థలం పరిశీలన

దమ్మపేట, నవంబర్ 6: ఈ నెల 13న దమ్మపేటలోని మల్లారం వద్ద సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ జరగనుంది. ఈ సభ ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, డీఎస్పీ వెంకటేష్ వేర్వేరుగా పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ, ప్రజాప్రతినిధులు-నాయకులు రావు జోగేశ్వరరావు, పైడి వెంకటేశ్వరరావు, దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, రామకృష్ణ, అబ్దుల్ జిన్నా, చిన్నంశెట్టి సత్యనారాయణ, శ్రీరాముల సత్యనారాయణ, యార్లగడ్డ బాబు తదితరులు ఉన్నారు.

### ఉధృత ప్రచారం

చంద్రుగొండ, నవంబర్ 6: మండలంలోని రావికంపాడు గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు(దారా బాబు) నిర్వహించారు. బూత్ కమిటీలను నియమించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

దమ్మపేట రూరల్, నవంబర్ 6: బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ ప్రజాప్రతినిధులు-నాయకులు సోమవారం దమ్మపేటలో ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టో కరప్రతాలను పంచారు. అందులోని అంశాలను వివరించారు. ఉయ్యాల చినవెంకటేశ్వరరావు, దారా మల్లికార్జున రావు, దారా యుగంధర్, యార్లగడ్డ బాబు, యార్లగడ్డ శ్రీను, చిన్నసెట్టి సత్యనారాయణ, పండూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 6: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని అబ్బుగూడెంలో నాయకులు ప్రచారం చేశారు. కొత్తూరు వెంకటేశ్వరరావు, కర్రి వెంకటేశ్వర్లు, చెన్నారావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట, నవంబర్ 6: పట్టణంలోని పేరాయిగూడెం పంచాయతీ ఏఎస్ఆర్ నగర్‌లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు-నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించారు. చిట్లూరి ఫణీంద్ర, జేకేవీ రమణారావు, చిప్పనపల్లి బజారయ్య, కలపాల బాబూరావు, జుజ్జూరపు శ్రీరామ్మూర్తి, రాంబాబు, చిన్న వెంకటేశ్వరరావు, మోటూరి మోహన్, కలపాల శ్రీనివాసరావు, చిప్పనపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆదాయం రూ.88,684



ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 6: మండలంలోని వినాయకపురం చిలకలగండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని దేవాదాయ-ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజనల్ అధికారి బెయిల్ సింగ్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం లెక్కించారు. సెప్టెంబర్ 16 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు రూ.88,684 వచ్చినట్లు ఆలయ ఈవో సూర్యప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బిర్రం రమాదేవి, అర్చకులు మేడూరి సాంబశివప్రసాద్ శర్మ, ప్రసాద్ శర్మ, గుమస్తా ప్రసాద్, సిబ్బంది శేఖర్, కమిటీ సభ్యుడు అశ్విన్‌కుమార్ పాల్గొన్నారు.

## ఐదు నామినేషన్లు దాఖలు




మెచ్చా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేస్తున్న మద్దతుదారులు

అశ్వారావుపేట, నవంబర్ 6: అశ్వారావుపేట నియోజకవర్గానికి సోమవారం వరకు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం ఒక్కరోజే రిటర్నింగ్ ఆఫీసర్ పి.రాంబాబు ఐదు నామినేషన్లు స్వీకరించారు. 4వ తేదీన మొదటి సెట్ నామినేషన్‌ను బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు దాఖలు చేశారు. సోమవారం రెండో సెట్ నామినేషన్‌ను ఆయన కుమారుడు రాము, మద్దతుదారు మాదల సతీష్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు కల్లూరి కిషోర్, ఆంగోతు కృష్ణ, కుంజా నాగమణి, కంగాల కల్లయ్య నామినేషన్ వేశారు.

## మాజీ హోంగార్డుకు జైలు

కొత్తగూడెం టౌన్, నవంబర్ 6 : భార్య ఆత్మహత్యకు కారణమైన హోంగార్డుకు జైలుశిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి భానుమతి సోమవారం తీర్పు చెప్పారు. పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన భూక్యా లక్ష్మి పెద్ద కుమార్తె ప్రమీలను హోంగార్డు ధరావత్ చంద్రుకు ఇచ్చి పదిహేను సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమార్తెలు. చంద్రు తరచుగా భార్యతో గొడవపడుతూ దుర్భాషలాడుతూ దూషించేవాడు. 16-12-2015న చంద్రు మద్యం తాగి గొడవపడడంతో మనస్థాపంతో మరుసటిరోజు తన భర్త కళ్లముందే కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ప్రమీల ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి పాల్వంచ రూరల్ ఎస్సై బి.సత్యనారాయణ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 10మంది సాక్షులను విచారించిన తర్వాత నేరం రుజువుకావడంతో ధరావత్ చంద్రుకు సెక్షన్ 306 ప్రకారం ఐదు సంవత్సరాలు సాధారణ జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా, ఐపీసీ 498(ఏ) ప్రకారం ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 6: స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు సోమవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పూజలు చేసి అన్న ప్రసాదం స్వీకరించారు.

## వ్యక్తి మృతి

కొత్తగూడెం టౌన్, నవంబర్ 6: సింగభూపాలేనికి చెందిన గోరింట్ల ప్రవీణ్ కొన్నేళ్ల క్రితం ప్రమాదవశాత్తు జూలూరుపాడులో విద్యుదాఘాతానికి గురై 90శాతం కాలిపోయాడు. తర్వాత కొద్దిరోజుల పాటు ఆస్పత్రిలోనే చికిత్స పొందిన ప్రవీణ్‌ను ఇటీవల కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారు. సోమవారం పరిస్థితి విషమించి ప్రవీణ్ మృతిచెందాడు.

## రూ.80వేలు సీజ్

అశ్వారావుపేట, నవంబర్ 6: స్థానిక రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. ఏపీలోని జంగారెడ్డిగూడేనికి చెందిన రంగా ప్రసాద్ నుంచి ఆధారాలు చూపని రూ.80వేలను ఎస్సై శ్రీకాంత్ స్వాధీనపర్చుకుని సీజ్ చేశారు.

## హత్య కేసు నిందితుల అరెస్ట్

అశ్వారావుపేట, నవంబర్ 6: వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు.. మండలంలోని మల్లాయిగూడేనికి చెందిన కొమరం సత్యావతి, గోపన్నగూడేనికి చెందిన లక్ష్మణరావు మధ్య వివాహేతర సంబంధం ఉంది. తమకు వెంకటేశ్వరరావు (సత్యావతి భర్త) అడ్డుగా ఉన్నాడని వారిద్దరూ భావించి, పథకం ప్రకారం ఈ నెల 2న కొడవలి, రాయితో దాడి చేసి హత్య చేశారు. మృతదేహాన్ని అక్కడే వదిలేసి రోడ్డు ప్రమాదం జరిగినట్లు కథ అల్లారు. మృతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సత్యావతి, లక్ష్మణరావు కలిసి హత్య చేసినట్లుగా తేల్చారు. హత్యకు ఉపయోగించిన కొడవలి, రాయిని స్వాధీనపర్చుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్